

గోమాతను పూజిద్దాం
బేతంచెర్ల: గోమాతను పూజించాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకట రెడ్డి అన్నారు. గోరుమానుకొండలో శుక్రవారం పూజలు చేశారు.




హాస్టళ్లు .. హౌస్‌ఫుల్!
ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశం పొందేందుకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో 'అడ్మిషన్స్ ఆర్ క్లోజ్డ్' అని బోర్డులు పెడుతున్నారు. 10లో



సీఎం జగన్‌తోనే సాధ్యం
మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతోందని కలెక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. 10లో

న్యూస్‌రీల్

పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్



కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్

కొలిమిగుండ్ల: పాఠశాలలు సురక్షితమైన ప్రదేశాలుగా ఉంచేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. విద్యార్థులు తమ సమస్యలు, చేదు అనుభవాలు తదితర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఫిర్యాదుల బాక్స్ ఉండేలా చర్యలు తీసుకుంది. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులపై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాల సుబ్బారెడ్డి ఫిర్యాదుల బాక్స్‌ను ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో బుక్ చేసి తెప్పించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వేధింపులు, లైగింక వేధింపులు, తదితర సమస్యలను నిర్భయంగా ఫిర్యాదు చేసేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో భాగంగా ఎస్పీ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. విధి నిర్వహణలో సిబ్బంది ఆందోళన చెందకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీపీవో సూపరింటెండెంట్ ఖాదర్‌వలి, స్పెషల్‌బ్రాంచ్ సీఐ దస్తగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవించిన రమాదేవి

కోవెలకుంట్ల: కలుగొట్ల గ్రామానికి చెందిన ఓ నిండు గర్భిణి శుక్రవారం 108లో ప్రసవించింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య రమాదేవి నెలలు నిండి ప్రసవ వేదనతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. కోవెలకుంట్ల అంబులెన్స్ గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా జోళదరాశి సమీపంలో అంబులెన్స్‌లోనే ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు అంబులెన్స్ ఈఎంటీ సతీష్, పైలెట్ కిరణ్‌కుమార్ తెలిపారు.

నంద్యాల మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

బొమ్మలసత్రం: నంద్యాల మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు గుంటూరు డివిజన్ రైల్వే ఆపరేషన్స్ మేనేజర్ కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా తర్లుపాడు నుంచి జగ్గంబొట్ల క్రిష్టాపురం వరకు జరుగుతున్న చివరిదశ పనులతో ఈనెల 27 నుంచి జూలై 5వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు చేస్తున్నారు. గుంటూరు- డోన్, గుంటూరు- తిరుపతి, గుంటూరు- కాచిగూడ, గుంటూరు- హైదరాబాద్ రైళ్లను తొమ్మిది రోజులపాటు రద్దు చేశారు. డోన్ -గుంటూరు, తిరుపతి-గుంటూరు, కాచిగూడ-గుంటూరు, హైదరాబాద్-గుంటూరు, కర్నూలు-మచిలీపట్నం రైళ్లను ఈనెల 28 నుంచి జూలై 6 వరకు రద్దు చేశారు. హుబ్లీ-విజయవాడ, విజయవాడ - హుబ్లీ, మచిలీపట్నం-ధర్మవరం రైళ్లు జూలై 3 నుంచి 5 వరకు రద్దు చేశారు. విజయవాడు-హుబ్లీ, హుబ్లీ -విజయవాడ, ధర్మవరం-మచిలీపట్నం రైళ్లు జూలై 4 నుంచి 6 వరకు రద్దు చేశారు.

గంగమ్మ తల్లిని నమ్ముకుని జీవనం సాగించే మత్స్యకారుల జీవితాలు దశాబ్దాలు గడిచినా ఏటి గట్టు దాటని దుస్థితి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కష్టాల వలలో చిక్కుకుని తీరం చేర లేక సంప్రదాయ వృత్తిని వదిలి ఇతర పనులకు వెళ్లిన కుటుంబాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన 'ఫిష్ ఆంధ్ర' పథకం మత్స్యకారుల జీవితాల్లో జల పుష్పాలు వికసించేలా మారింది. ఓ వైపు ప్రభుత్వం అందించే రాయితీతో నిరుద్యోగుల స్వయం ఉపాధికి బాటలు వేస్తుండగా.. మరో వైపు వినియోగదారులకు నాణ్యమైన చేపలు తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చాయి.

– నంద్యాల (సెంట్రల్)



ఉపాధి చేపట్టి.. కష్టాల తీరం దాటి!

- ఫిష్ ఆంధ్రతో వినియోగదారుల చెంతకు చేప ఉత్పత్తులు
- జిల్లాలో 105 రిటైల్ విక్రయశాలల ఏర్పాటుకు చర్యలు
- గంగపుత్రులకు మరింత ప్రయోజనం
- రాయితీతో నిరుద్యోగుల స్వయం ఉపాధికి ఊతం

కృష్ణానది తీరం, భారీ జలాశయాలు, చెరువులు ఉండటంతో జిల్లాలో ఎంతో విలువైన మత్స్య సంపద ఉంది. ఏటా వేలం పాటదారులు, స్థానిక మత్స్యకారులు పలు రకాల చేపల్ని పెంచి ఉపాధి పొందుతున్నారు. కాగా స్థానికంగా సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో కోల్‌కత్తాకు వివిధ మార్గాల్లో ఎగుమతి చేస్తున్నారు. దీంతో వీరికి వ్యయప్రయాసలతో పాటు ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంతేకాక విలువైన మత్స్య సంపద జిల్లా వాసులకు అందుబాటులో లేకుండా పోతోంది. మత్స్యకారుల కష్టాలు, వినియోగదారుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా కొత్తగా ఆక్వా హబ్‌లను అందుబాటులోకి



నందికొట్కూరుకు చెందిన జల్లి శ్రీనివాసులుకు ఐసర్ వాహనాన్ని పంపిణీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

తెచ్చింది. వీటికి అనుబంధంగా గ్రామస్థాయి నుంచి నగర పాలికల వరకు రిటైల్ విక్రయశాలలు, విలువ జోడింపు కేంద్రాలు, బతికిన చేపల అమ్మకం యూనిట్లు, ఫిష్ కియోస్క్‌లు, అమ్మకపు వాహనాలతో మత్స్యశాఖలో నవశకానికి నాంది పలికినట్లైంది. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల వెంబడి కృష్ణా తీరం ఉంది. అలాగే వెలుగోడు, అవుకు, అలగనూరు, గోరుకల్లు భారీ జలాశయాలతో పాటు భారీగా చెరువులు, ఇతర నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో మత్స్యకారులు చేపల వేట సాగిస్తూ జీవనం పొందుతున్నారు. వీరికి ఫిష్ ఆంధ్ర పథకం మరింత ప్రయోజనకరంగా మారనుంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 105 రిటైల్ విక్రయశాలల్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 41 మంది అర్హులైన యువత ముందుకొచ్చారు. దీంతో పాటు ఐస్ బాక్స్‌తో కూడిన ద్విచక్ర వాహనాలు-37, ఆటోలు-12, బతికిన చేపల అమ్మకం కేంద్రాలు-7, ఇన్సులేటెడ్ వాహనాలు-6, జలాశయాల్లో పంజరం పెంపక యూనిట్లు-12, ఫిష్ కియోస్క్‌లు-26, విలువ జోడింపు యూనిట్లు-2, మినీ ఫిష్ కియోస్క్‌లు-35 ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 21 ద్విచక్రవాహనాలు, 2 నాలుగు చక్రాల ట్రాలీలు నంద్యాల, నందికొట్కూరు వారికి, 4 ఆటోలు బనగానపల్లె, అవుకు, గోరుకల్లు, రుద్రవరానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఫిష్ ఆంధ్రలో లభ్యమయ్యే చేపలు..

ఫిష్ ఆంధ్ర విక్రయశాలల్లో స్థానిక మత్స్య రకాలైన బొచ్చె, రోహు, వాలుగ, జిలేబీ, బురదమట్ట, ఇసుకదొందు, ఎర్రమోసు, బంగారు తీగ రకాలతో పాటు సముద్రపు రొయ్యలు (వెనామి), నీలకంఠ రొయ్యలు, పీతలు తదితర నాణ్యమైన చేప ఉత్పత్తులు లభించనున్నాయి. నేరుగా ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తుండటంతో వినియోగదారులకు తక్కువ ధరకు లభించే అవకాశం కలిగింది.

ఆధునిక మత్స్య వాహనం

మూడు చక్రాల వాహనంలో 200 కిలోల మత్స్య ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. 20 లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ఐస్ బాక్స్‌లు, తూకం యంత్రం, మైక్ సౌకర్యం, చేపల్ని తోమటానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. నాలుగు చక్రాల వాహనంలో వాహన రకాన్ని బట్టి 2 నుంచి 8 టన్నుల వరకు నిల్వ ఉండేలా రూపొందించారు. అత్యాధునిక డ్రెస్సింగ్, రెడీ టూ ఈట్ కుకింగ్ చేసుకునేందుకు వీలు కల్పించారు. వీటి ద్వారా బతికిన, తాజా చేపలు, రొయ్యలు, వండిన, కాల్చిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లోనూ అమ్ముకోవచ్చు. చిరుతిళ్లు, తాజాగా వండిన ఆహారం వీటిలో ఉంటుంది. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఫిష్‌కియోస్క్ ఫ్రాంచైజీ త్వరలో అందుబాటులోకి రానుంది.

రాయితీ వర్తింపు ఇలా...

ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగమైన పలు యూనిట్లకు ప్రభుత్వం భారీగా రాయితీలు కల్పిస్తోంది. మూడు చక్రాల వాహనం ధర రూ.4 లక్షలు కాగా...నాలుగు చక్రాల వాహనం ధర పరిమాణాన్ని బట్టి రూ.12 లక్షల నుంచి రూ.23 లక్షలుగా నిర్ణయించారు. అదే విధంగా విలువ జోడింపు యూనిట్ రూ.50 లక్షలు, ఫిష్ కియోస్క్ యూనిట్ రూ.10 లక్షలు, మినీ ఫిష్ రిటైల్ యూనిట్ రూ.1.46 లక్షలుగా ఉంది. వీటన్నింటిపై ఎస్సీ, ఎస్టీ, మహిళా (ఏ వర్గం వారైనా) లబ్ధిదారులకు 60 శాతం చొప్పున, ఇతరులకు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. మొత్తం ధరలో 10 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే.. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా సమకూరుస్తారు.

సీఎంకు రుణపడి ఉంటాం



ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోలో పలు ప్రాంతాలు తిరిగి అమ్మకాలు చేస్తున్నాను. ఇంతకుముందు ఒకేచోట కూర్చుని వ్యాపారం చేస్తుండటంతో వినియోగదారులకు తెలిసేది కాదు. ఇప్పుడు మైక్‌లో చెబుతూ డిమాండ్ ఉన్న ప్రాంతాలకు వెళ్లి అమ్ముకుంటున్నాను. కొనుగోలు, ఆటో నిర్వహణ ఖర్చుపోనూ రూ.800 నుంచి వెయ్యి దాకా సంపాదిస్తున్నాను. ఈ అవకాశం కల్పించినందుకు సీఎం జగన్‌కు మా కుటుంబీకులు రుణపడి ఉంటాం.

– మోను నాగ కృష్ణుడు, ఆటో లబ్ధిదారుడు, బనగానపల్లె

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



చుట్టుపక్కల వాగులు, చెరువుల వద్దకు వెళ్లి గంప గుత్తగా చేపలు కొనుగోలు చేసి చుట్టపక్కల గ్రామాల్లో అమ్ముకుంటుంటాను. రెక్కాడితే గాని డొక్కాడని నాకు వాహనం కొనేంత స్తోమత లేదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో నా కల నెరవేరింది. ఇప్పుడు విరివిగా, తక్కువ ధరకు చేపలు దొరికే ప్రాంతాలకు దూరమైనా వెళ్లి తెచ్చుకుని లాభసాటి ధరలకు అమ్ముకుంటున్నాను. – సేగు పుల్లయ్య, అవుకు

ఫిష్ ఆంధ్రతో విప్లవాత్మక మార్పులు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన ఫిష్ ఆంధ్ర పథకం చాలా ఉపయోగకరం. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ మనజీర్ జిలానీ ప్రత్యేక చొరవతో యూనిట్ల కేటాయింపు ముమ్మరం చేస్తున్నాం. డీఆర్‌డీఏ, మెప్మా ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. అలాగే వినియోగదారులు నాణ్యమైన, తాజా చేపలను పొందవచ్చు. దీనిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, ఆసక్తి గల వారిని ప్రోత్సహిస్తున్నాం. నిరుద్యోగ యువత ముందుకు రావాలని అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో విక్రయశాలలు ప్రారంభమయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నాం.

– రాఘవరెడ్డి, సంయుక్త సంచాలకులు, జిల్లా మత్స్యశాఖ

పది సప్లిమెంటరీ ఫలితాల్లో 11వ స్థానం

- జిల్లాలో 64.99 శాతం ఉత్తీర్ణత

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో నంద్యాల జిల్లా 11వ స్థానంలో నిలిచింది. జిల్లాలో సప్లిమెంటరీ పరీక్షలకు 10,092 మందికి గాను బాలురు 5,896, బాలికలు 4,196 మంది హాజరయ్యారు. అందులో 3,580 మంది బాలురు, 2,979 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. 64.99 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 11వ స్థానంలో నంద్యాల జిల్లా నిలిచింది. ఇందుకు కృషి చేసిన ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులను డీఈఓ సుధాకర్ రెడ్డి అభినందించారు. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఈనెల 29లోపు సీఎఫ్ ఎంఎస్ సిటిజన్ చలానా www.cfms.ap.gov.in ద్వారా ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలన్నారు. జవాబు పత్రాల పునః ధ్రువీకరణ, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు సీఎఫ్ఎంఎస్ సిటీజన్ చలానా ద్వారా ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 మేర 29వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ తెలిపారు.

కలెక్టర్ చొరవతో ఉత్తీర్ణత శాతం మెరుగు..

జిల్లాలో మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 60 శాతం ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో నంద్యాల జిల్లాకు 26వ స్థానం లభించింది. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మెరుగు పరిచేందుకు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ప్రత్యేక చొరవ చూపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా సిద్ధమయ్యేలా విద్యాశాఖ అధికారులకు సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఉదయం, మధ్యాహ్నం సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. డీఈఓ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయడంతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 64.99 శాతం ఉత్తీర్ణత రావడంతో నంద్యాల జిల్లా రాష్ట్రంలో చివరి స్థానం నుంచి 11వ స్థానానికి చేరుకుంది.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ న్యాయం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్




కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ మనజీర్‌జిలానీ, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జేసీ నిశాంతి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, తదితరులు

నంద్యాల: సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలనే ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' ప్రథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా లాంఛనంగా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీతో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు చిన్న చిన్న సమస్యలతో లబ్ధికి దూర కాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెలరోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రత్యేక క్యాంపులలో అక్కడికక్కడే వివిధ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇంకం ట్యాక్స్ మొదలైన 11 రకాలు ధ్రువీకరణపత్రాలు) సర్వీస్ ఫీజు లేకుండా అందించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రభుత్వానికి సంబంధించి ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడమే కాకుండా లంచాలు ఇచ్చుకొనే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేశారన్నారు. పింఛన్, రేషన్‌కార్డు నేరుగా ఇంటికే తీసుకొచ్చే గొప్ప వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ సుపరి పాలనకు పునాదులు వేశారన్నారు. పొరపాటున ఎక్కడైనా, ఎవరికైనా పథకాలు అందకుండా మిగిలి పోయిన అర్హులకు న్యాయం చేయడమే జగనన్న లక్ష్యమన్నారు.

ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు సిటీ: మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లకు స్థానాలు కేటాయించేందుకు శుక్రవారం కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఏక్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 1998 డీఎస్సీ, 2008 డీఎస్సీల ద్వారా ఎంపికైన ఎంటీఎస్ టీచర్లు హాజరయ్యారు. తమలో 50 ఏళ్లకుపైగా బడిన వారే ఎక్కువగా ఉన్నారని బ్లాక్ చేసిన ఖాళీలను సైతం చూపించాలని డీఈఓ రంగారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఎంటీఎస్ టీచర్ల సంఖ్య కంటే 15 శాతం ఖాళీలు ఎక్కువగా చూపించడంతో కౌన్సెలింగ్ సాఫీగా సాగింది. 1998 డీఎస్సీ టీచర్లు 209, 2008 డీఎస్సీ టీచర్లు 175 మందికి కోరుకున్న స్థానాలను అప్పగించారు. ఉత్తర్వులు అందుకున్న వారందరూ వెంటనే స్కూళ్లలో చేరాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏడీ శ్యామ్యూల్ పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, పర్యవేక్షకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన ఎంటీఎస్ టీచర్లు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల (సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌యార్డులో పసుపు కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అని చంద్రబాబు నాయుడు అన్నదాతల్ని అవమానిస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ప్రతి దశలోనూ అండగా ఉంటూ వ్యవసాయాన్ని పండగలా మార్చారన్నారు. బహిరంగ మార్కెట్లో పసుపు ధర క్వింటం రూ. 5 వేలు ఉంటే ప్రభుత్వమే రూ.6,850 ధరతో కొనుగోలు చేస్తూ రైతులకు బాసటగా నిలుస్తుందని పేర్కొన్నారు. మిర్చి కొనుగోళ్లు కూడా మద్దతు ధరకు మార్కెట్ యార్డులోనే కొనుగోలు చేయడంతో రైతులు ఊరట చెందుతున్నారన్నారు. మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగ రాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా తమ శాఖ ద్వారా పసుపు, మొక్కజొన్న, శనగలు మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మేనేజర్ కల్పన, డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు

ఏఓయూలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023-24 ఏడాదికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శుక్రవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీలో చేరే విద్యార్థులు అంబేడ్కర్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్, డిప్లొమో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 7382929680కు సంప్రదించాలన్నారు.

సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారంతో ముగిసింది. అయితే అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అధికంగా మార్కులు వేసుకున్నట్లు వెరిఫికేషన్‌లో గుర్తించారు. దీంతో రీ వెరిఫికేషన్‌కు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 233 పోస్టులు ఖాళీ ఉండగా సుమారు 7 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. సబ్జెక్టుల వారీగా ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మెరిట్ లిస్టులో ఉన్న వారిని సర్టిఫికెట్లను పరిశీలించారు. రీ వెరిఫికేషన్‌లో ఒక్కో పోస్టుకి ఐదు మందిని ఎంపిక చేసి సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

వికలాంగుల పునరావాస కేంద్రంలో ఉద్యోగ అవకాశాలు

కర్నూలు(అర్బన్): రెడ్‌క్రాస్ సొసైటీ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో గౌరవ వేతనంపై 14 రకాల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కేడర్లకు సంబంధించి రూ.6,250 నుంచి రూ.20,500 వరకు గౌరవ వేతనం లభిస్తుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30న సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో స్వయంగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులను అందించాలన్నారు. ఇతర వివరాలను www.kurnool .ap.gov.in వెబ్‌సైట్‌ను, 08518-277864 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతపై పీడీ యాక్ట్

బొమ్మలసత్రం: నంద్యాల, బండిఆత్మకూరులో గంజాయి, తదితర మాదకద్రవ్యాలను అక్రమంగా విక్రయిస్తున్న షేక్ ఖైరూన్‌బీపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఏ కోడూరు గ్రామానికి చెందిన షేక్ ఖైరూన్‌బీపై ఇప్పటికే ఏడు గంజాయి కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో పీడీ యాక్ట్ కింద కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

దూరవిద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల (సెంట్రల్): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(లాం) తరపున దూర విద్యా కేంద్రం ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 2023 నుంచి ప్రారంభం కానున్న 4 ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులైన సేంద్రియ వ్యవసాయం, మిద్దె తోటల, తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించి 2 నెలల కోర్సు కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఒక్కో కోర్సుకు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని, వీరికి ఆన్‌లైన్ సదుపాయం ఉండాలని పేర్కొన్నారు. జూలై 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ ఏయూ. ఇన్, 8008788776, 8309626619ను సంప్రదించాలని సూచించారు.

వీసీ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు పదవీ కాలం నవంబర్‌తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ పోస్టుకు అర్హులైన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ఈ నెల 22వ తేదీన ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

హాస్టళ్లు .. హౌస్‌ఫుల్!

- పలు హాస్టళ్లలో అడ్మిషన్లు క్లోజ్డ్ అని బోర్డులు
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ప్రవేశాల జోరే కారణం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలు, మోడల్ స్కూల్స్ ఉన్నా.. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశం పొందేందుకు విద్యార్థుల తాకిడి పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసింది. దీంతో ఆయా పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులపై ప్రభుత్వ శ్రద్ధ పెరగడంతో హాస్టళ్లలో చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ప్రవేశం పొందాలంటే మొదటి ప్రాధాన్యతగా ఆర్ఫన్స్ (తల్లిదండ్రులు లేని చిన్నారులు), సెమీ ఆర్ఫన్స్ (తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేకపోవడం), చదువు మధ్యలోనే మానేసిన వారికి అవకాశం కల్పిస్తారు. వీరితో పాటు సాధారణ వర్గాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల్లోని సీట్ల లభ్యత మేరకు ప్రవేశం కల్పిస్తారు. ఈ పాఠశాలల్లో సీట్లు లభించని వారు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం పొంది సమీపంలోని ప్రభుత్వ హాస్టళ్లలో చేరేందుకు పోటీ పడుతున్నారు.

పెరిగిన మెస్ చార్జీలు

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచింది. ప్రీ మెట్రిక్ విద్యార్థులకు రూ.1250 నుంచి 1400లకు, పోస్టు మెట్రిక్ విద్యార్థులకు రూ.1400 నుంచి రూ.1600లకు మెస్ చార్జీలను పెంచింది.

- జిల్లాలోని కృష్ణగిరి మండలం కంభాలపాడులోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ప్రస్తుతం 390 మంది రెన్యూవల్ విద్యార్థులు ఉన్నారు. వసతి గృహంలో ఈ విద్యాసంవత్సరం 6వ తరగతిలో 70 మందికి ప్రవేశం కల్పించాల్సి ఉంది. అయితే 250 మంది విద్యార్థులు తమకు ప్రవేశం కల్పించాలని దరఖాస్తులను తీసుకువెళ్లారు. మంజూరైన విద్యార్థుల సంఖ్య కంటే అదనంగా ప్రవేశం కల్పించేందుకు వసతులు లేవని, సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారి 'అడ్మిషన్స్ ఆర్ క్లోజ్డ్ ' అని బోర్డు పెట్టేశారు.
- కర్నూలుకు సమీపంలోని పెద్దపాడు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో కూడా ఉన్న వసతులకు అనుగుణంగా 250 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ హాస్టల్‌లో ప్రవేశం కావాలని నిత్యం పదుల సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు వస్తుండడంతో ప్రవేశాలు అయిపోయాయనే బోర్డును పెట్టారు.



హాస్టల్‌లో ప్రవేశాల కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులు





వసతి గృహాల్లో అడ్మిషన్స్ ఆర్ క్లోజ్డ్ బోర్డులు పెట్టిన దృశ్యం

జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల వివరాలు		బీసీ సంక్షేమ వసతి గృహాల వివరాలు	
ప్రీమెట్రిక్ హాస్టళ్లు:	29	ప్రీమెట్రిక్ హాస్టళ్లు:	31
మంజూరైన విద్యార్థుల సంఖ్య:	4,300	మంజూరైన విద్యార్థుల సంఖ్య:	6,030
ప్రస్తుత విద్యార్థుల సంఖ్య:	2,687	ప్రవేశం పొందిన విద్యార్థుల సంఖ్య:	4,969
ఖాళీలు:	1,613	ఖాళీలు:	1,361
పోస్టు మెట్రిక్ హాస్టళ్లు:	08	పోస్టు మెట్రిక్ హాస్టళ్లు:	16
మంజూరైన విద్యార్థుల సంఖ్య :	800	మంజూరైన విద్యార్థుల సంఖ్య:	1,600
ప్రస్తుత విద్యార్థుల సంఖ్య:	589	ప్రవేశం పొందిన వారి సంఖ్య:	1,462
ఖాళీలు:	211	ఖాళీలు:	138

వసతులకు అనుగుణంగా విద్యార్థులకు ప్రవేశం



జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న వసతులకు అనుగుణంగా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు లేకుంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు కూడా అర్థం చేసుకోవాలి.

– పీ వెంకటలక్షుమ్మ, జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి

విడాకుల నేపథ్యంలో యువకుడు ఆత్మహత్య



రాజశేఖర్ బాబు (ఫైల్)

కర్నూలు: విడాకుల నేపథ్యంలో కలత చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్.నాగప్ప వీధిలో నివాసముంటున్న మాధవస్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు రాజశేఖర్ బాబు ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. ఎమ్మిగనూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన దస్తగిరి కుమార్తె కవితతో 2021 ఆగస్టు 22న పెద్దల సమక్షంలో వివాహమైంది. కొంతకాలం సంసారం సాఫీగా సాగినా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఈ ఏడాది ఏప్రిల్ 10న విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి రాజశేఖర్ కలత చెందాడు. గురువారం రాత్రి కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ డార్మెంటరీలో గది అద్దెకు తీసుకున్నాడు. వెంట తీసుకెళ్లిన పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం లాడ్జి నిర్వాహకులు గది శుభ్రం చేయిస్తుండగా పురుగుల మందు వాసన రావడంతో తలుపులు తెరిచి చూడగా రాజశేఖర్‌బాబు విగతజీవుడై కనిపించాడు. మృతుని కుటుంబ సభ్యులతో పాటు నాల్గవ పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. విడాకుల నేపథ్యంలోనే తమ కుమారుడు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తండ్రి మాధవస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత వస్త్రాలను ఆదరిద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత వస్త్రాలకు మరింత మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చేనేత, జౌళి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత తెలిపారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు కొండారెడ్డి బురుజు దగ్గరలోని లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియంలో ఆప్కో ప్రత్యేక కౌంటర్‌ను ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపోరియంలోని హస్తకళా వస్తువులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ వృద్ధిలోకి రావాలంటే మార్కెటింగ్ సదుపాయం అత్యవసరమన్నారు. చేనేత వస్త్రాలపై 30 శాతం డిస్కౌంటు లభిస్తుందని, ఆప్కో కౌంటర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్కో డివిజనల్ మేనేజర్ భారతి, లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య, ఆప్కో ప్రతినిధి పంపయ్య పాల్గొన్నారు.



ఆప్కో కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- నూతన భవనాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని



రైతులకు యంత్ర పరికరాలు అందజేస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్

ఓర్వకల్లు: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. హుసేనాపురం గ్రామంలో సుమారు రూ.3 కోట్లకు పైగా ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెండు సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాల భవన సముదాయాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ సృజన ప్రారంభించారు. అనంతరం జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన ద్వారా మంజూరైన వ్యవసాయ పరికరాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో రూ.1.96 కోట్ల వ్యయంతో పది పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రూ.43.60 లక్షల వ్యయంతో రెండు ఆర్‌బీకేలు, రూ. 75 లక్షల వ్యయంతో రెండు సచివాలయ భవనాలను నిర్మించినట్లు చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దేశంలోనే ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ, వలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ఇంటిముంగిటకే ప్రభుత్వ పథకాలను తీసుకొచ్చిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. హుసేనాపురం గ్రామంలో నిర్మించిన పది పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జగనన్న సరక్ష పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. గ్రామ నాయకుల విన్నపం మేరకు గ్రామానికి ఇప్పటికే రెండు సామూహిక మరుగుదొడ్లను మంజూరు చేశామని, మరొక మరుగు దొడ్డిని వాటర్ షెడ్ నిధుల ద్వారా నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో నూతన భవన సముదాయాలకు అవసరమయ్యే స్థలాలను విరాళంగా ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమరనాథ్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ, ఎంపీటీసీ సభ్యులు చాంద్‌బాష, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

'కావేరి–జాదుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు'

కర్నూలు(అగ్రికల్చర్): కావేరి–జాదు బీటీ పత్తి విత్తనాలతో రైతులు నష్టపోయి రెండేళ్లవుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ జిల్లా వ్యవసాయ అధికారిపై ధ్వజమెత్తారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జేసీ నారపురెడ్డి మౌర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్లే రైతులు నష్టపోయారని, కంపెనీకి నోటీసులు ఇచ్చి జిల్లాలో ఎలాంటి విత్తనాలు అమ్మకుండా చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. డీఏవో వరలక్ష్మి స్పందిస్తూ కావేరి–జాదు పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే అంశం కమిషనర్ పరిధిలో ఉందన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పూర్తి వివరాలు ఇస్తే కమిషనర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మౌర్య మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల నియంత్రణకు తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లాలో రాగి సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలో రాగి 1,500 ఎకరాల్లో సాగు చేయడం సాధ్యం కాదని, కనీసం రెండు నీటి తడులు ఇవ్వాలని ఓ శాస్త్రవేత్త సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య, ఉద్యాన శాఖ ఏడీ పి.రామాంజనేయులు, మత్స్యశాఖ డీడీ శ్యామల, మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు, ఏపీ సీడ్స్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన దృశ్యం

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర ఉన్న సుంకులమ్మ దేవాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలో హుండీని పగులగొట్టి అందులోని రూ.70 వేలు నగదు, బంగారు ముక్కు పుడకలు, 20 తులాల వెండిని దోచుకున్నారని ఆలయ సిబ్బంది తెలిపారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ పూర్తి అయిన తరువాత హుండీలో కానుకలు లెక్కిస్తారు. గతంలో కూడా ఈ ఆలయంలో రూ.15వేలు విలువ చేసే రెండు గంటలను దొంగలించారు. చోరీ విషయం తెలుసుకుని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్వరలోనే పులకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు

- కర్నూలు-బళ్లారి జాతీయ రహదారి కోసం కృషి
- దిశ కమిటీ సమావేశంలో ఎంపీ సంజీవ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్ కుమార్

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు తాగునీటి పథకం, పులకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు టెండర్ దశలో ఉన్నాయని, త్వరలోనే వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎంపీ అధ్యక్షతన దిశ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జే.సుధాకర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కర్నూలు-బళ్లారి జాతీయ రహదారి కోసం కేంద్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని 20 సార్లు కలిశానని, ప్రస్తుతం ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ఫైల్ కేబినెట్ ఆమోదం కోసం ఉందని, త్వరలోనే ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. ఈ రహదారిని జాతీయ ప్రాజెక్టుగా చేయడం తన జీవిత ఆశయమని, దాని సాధన కోసం కృషి చేస్తున్నానే ఉంటానని చెప్పారు. కర్నూలు జిల్లాలోని పడమటి ప్రాంతంలో నీటి వనరులను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశ కమిటీకి ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతంలోనూ రైతులు పంటలు సాగుచేస్తుంటే జిల్లా పడమటి ప్రాంతంలో ఎందుకు నీటి వనరులను పెంపొందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పొలాల రహదారులు, కాలువల పూడిక తీత తదితర పనులు చేపడితే ఉపయోగం ఉంటుందన్నారు. ఎల్‌ఎల్‌సీ, కేసీ కెనాల్ కింద ఆయకట్టు లేకున్నా చూపడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు కోల్పోతున్నారని దిశ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి సభ దృష్టికి తీసుకురావడంతో ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 30 ఏళ్లుగా నీళ్లు ఇవ్వకున్నా ఎలా ఆయకట్టుగా చూపుతున్నారని అధికారులను ప్రశ్నించారు. కర్నూలు రైల్వే స్టేషన్‌కు ప్రస్తుతం తూర్పు వైపు మాత్రమే వెలుపలికి వెళ్లేందుకు గేటు ఉందని, పశ్చిమ వైపు నుంచి కూడా స్టేషన్‌లోకి వెళ్లేందుకు అవసరమైన గేటు మంజూరైందని, అయితే గేటు నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలంలో ఉన్న వారిని వేరే ప్రదేశానికి తరలించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని వారిని వేరే ప్రాంతానికి తరలించి అక్కడ నివాసాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దిశ కమిటీలో ఆమోదం తెలిపిన వాటిని కూడా అధికారులు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నటేకూరు దగ్గర జాతీయ రహదారిలో నాలుగు టిప్పర్ల మట్టి వేయకపోవడంతో ఎంతో మంది ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కల్లూరు, కర్నూలు మండలాల్లో చెన్నై–సూరత్ జాతీయ రహదారికోసం భూములు ఇస్తున్న రైతులకు అతి తక్కువ పరిహారం ఇవ్వడం అన్యాయమన్నారు.
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ మాట్లాడుతూ.. కేసీ కెనాల్ నీటిని అక్రమంగా వాడుకుంటున్నా ఇరిగేషన్ అధికారులు ఏమి చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా తాను నాలుగుసార్లు ఫిర్యాదు చేశానని, అయినా వారు స్పందించడంలేదన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో రూ.150 కోట్లతో పలు రహదారుల నిర్మాణాలను చేపట్టినట్లు చెప్పారు.
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ..దిశ కమిటీ సమావేశం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఉపాధి హామీ ద్వారా అధికంగా ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పొలాల రస్తాలు, కాలువల పూడిక తీత పనులను ఉపాధిలో చేపట్టుకోవచ్చని, భవిష్యత్‌లో ఇలాంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సభ్యులు లెవనెత్తిన రోడ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకొని పూర్తి చేయించాలని కోరారు. జాతీయ రహదారుల అధికారులు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ అప్పలకొండ, ఇరిగేషన్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.